సాక్షి
విశాఖపట్నం
సోమవారం : 5, మే 2025



గోస్తనీ గొంతెండుతోంది 8లో



సింహాచలం 'ప్రసాద్' పనుల్లో నాణ్యత ఎంత? 8లో



సిటీలో సమంత 8లో

వానమ్మ.. వాన!

- వర్షాలతో ఉపశమనం
- మొన్నటి వరకూ గరిష్ట ఉష్ణోగ్రతలతో విలవిల
- మరో రెండు రోజుల పాటు జిల్లాలో అక్కడక్కడా వానలు



సాక్షి, విశాఖపట్నం : అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఏర్పడిన ఉపరితల ఆవర్తనంతో కొంత కాలంగా వాతావరణంలో భిన్నమైన మార్పులు కనిపిస్తున్నాయి. సాధారణంగా మే నెల అంటే.. భానుడి భగభగలు.. సెగలు కక్కించే ఉక్కపోత.. ఊపిరి సలపని వడగాలుల తీవ్రతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతుంటారు. కానీ.. ఈసారి మాత్రం కొద్ది రోజుల పాటు చల్లని వాతావరణం ఏర్పడుతోంది. కొద్ది రోజులుగా.. వాతావరణం ఎండలతో మొదలై.. మధ్యలో వర్షాలు పడి మళ్లీ.. ఎండలు పెరిగి.. సాయంత్రం నాటికి మబ్బుల వాతావరణంతో చల్లబడుతోంది. ప్రతి రోజూ సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు నగరానికి గొడుగులు పడుతున్నాయి. ఈ నెల 1 నుంచి 4వ తేదీ వరకూ జిల్లాలో సగటు వర్షపాతం కంటే మూడు రెట్లకు పైగా అధికంగా నమోదవ్వడం విశేషం. దశాబ్ద కాలంలో మే నెలలో మొదటి 4 రోజులు ఈ తరహా వర్షపాతం నమోదు కావడం ఇదే ప్రథమమని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. మే 1 నుంచి 4 వరకూ సగటు వర్షపాతం 5.1 మి.మీ కాగా.. ఈసారి 17 మి.మీ వర్షపాతం నమోదైంది. ప్రీమాన్‌సూన్ సీజన్‌లో వర్షాలు కురవడం సర్వసాధారణమే అయినా.. ఈసారి మాత్రం అకాల వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయని విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం(సీడబ్ల్యూసీ) అధికారులు చెబుతున్నారు. మరో రెండు మూడు రోజుల పాటు ఇదే వాతావరణం ఉంటుందని వెల్లడించారు. జిల్లాలో ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయనీ.. నగర పరిధిలో అక్కడక్కడా వర్షాలు పడే అవకాశాలున్నాయని తెలిపారు. ఈదురుగాలుల ప్రభావం కొనసాగుతుంటుందనీ.. ఉరుములు, మెరుపుల తీవ్రత కూడా అధికంగా ఉంటుందని చెబుతున్నారు. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

'నీట్'గా.. ప్రశాంతంగా..



విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద సందడి

- జిల్లాలో 16 కేంద్రాల్లో నీట్ పరీక్ష

సాక్షి, విశాఖపట్నం/మురళీనగర్: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి గాను నీట్ యూజీ–2025 పరీక్ష జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 16 కేంద్రాల్లో 7 వేల మందికి పైగా విద్యార్థులు పరీక్ష రాశారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ పరీక్ష కేంద్రానికి 480 మందిని కేటాయించగా 474 మంది పరీక్ష రాసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు చెప్పారు. గైస్‌లోని పరీక్ష కేంద్రానికి 480 మందిని కేటాయించగా 471 మంది పరీక్షకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్, కాలేజీ ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ తెలిపారు. రెండు సెషన్స్‌లో జరిగిన ఈ పరీక్షను ఎన్‌టీఏ అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు ఈసారి సమగ్ర విధానాన్ని అనుసరించింది. కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఒక కేంద్రీకృత కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి.. జిల్లాలో క్షేత్రస్థాయిలో పరీక్షల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించారు. అయితే చెవిదిద్దులు, కాలి మెట్టెలు, చైన్లు వంటివి తొలగించిన తర్వాతే పరీక్ష కేంద్రంలోకి అడుగు పెట్టేలా కఠినంగా వ్యవహరించడంతో అమ్మాయిలు కాస్త ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరీక్ష పత్రం కఠినంగా ఉన్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. ఫిజిక్స్ చాలా కష్టతరంగా.. కెమిస్ట్రీ మధ్యస్థంగా.. బయాలజీ చాలా సులభంగా ఉందని విద్యార్థులు పేర్కొన్నారు.



ముక్కు పుడక తీస్తున్న విద్యార్థిని తల్లి



అభ్యర్థుల చెవి దుద్దులు, మెడలో గొలుసు, కాలి మెట్టెలు తీస్తున్న వారి కుటుంబ సభ్యులు

ఆ.. 2,865 టికెట్లు ఎవరికిచ్చారు?



- చందనోత్సవం టికెట్ల లెక్కల్లో భారీ తేడా
- అధికారిక లెక్కలకు, వాస్తవానికి వ్యత్యాసం
- అంతరాలయ దర్శనాలపైనా విమర్శలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి చందనోత్సవం టికెట్ల విక్రయాలు, దర్శనాల నిర్వహణకు సంబంధించి దేవస్థానం విడుదల చేసిన జాబితాలో పలు వ్యత్యాసాలు, అస్పష్టతలు ఉన్నాయి. ముఖ్యంగా టికెట్ల సంఖ్య, తెల్లవారుజామున కల్పించిన అంతరాలయ దర్శనాల విషయంలో అధికారుల లెక్కలపై భక్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సింహాచలం దేవస్థానం ఈవో కె. సుబ్బారావు పేరిట ఆదివారం విడుదలైన జాబితా ప్రకారం.. ఈ ఏడాది చందనోత్సవం సందర్భంగా రూ. 300 టికెట్లు ఆఫ్‌లైన్‌లో 15,495, ఆన్‌లైన్‌లో 7,591 కలిపి మొత్తం 23,086 విక్రయించారు. అలాగే రూ.1000 టికెట్లు ఆఫ్‌లైన్‌లో 13,803, ఆన్‌లైన్‌లో 3,999 కలిపి మొత్తం 17,802 జారీ చేశారు. రూ.1500 టికెట్లు కేవలం ఆఫ్‌లైన్‌లో 3,000 విక్రయించినట్లు పేర్కొన్నారు. వీటికి అదనంగా 496 అంతరాలయ టికెట్లుగా చూపించారు. ఈ లెక్కల ప్రకారం మొత్తంగా 44,384 టికెట్లు విక్రయించినట్లు జాబితాలో ఉంది. అయితే గత నెల 24 నుంచి 29 వరకు రోజువారీగా టికెట్ల విక్రయాల జాబితాను పరిశీలిస్తే.. మొత్తం 41,519 టికెట్లు మాత్రమే అమ్ముడైనట్లు పేర్కొన్నారు. దీంతో దేవస్థానం విడుదల చేసిన మొత్తం లెక్కకు, రోజువారీ లెక్కలకు మధ్య 2,865 టికెట్ల వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది. కాగా.. తెల్లవారుజామున అంతరాలయ దర్శనం కేవలం 496 మందికి మాత్రమే కల్పించినట్లు అధికారులు చూపించడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. చందనోత్సవం రోజు ఉదయం చాలా మందిని అంతరాలయ దర్శనానికి అనుమతించినట్లు భక్తులు, స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. వారి అంచనా ప్రకారం అంతరాలయ దర్శనం పొందిన వారి సంఖ్య వెయ్యికి పైగానే ఉంటుందని అంటున్నారు. దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త, టీటీడీ నుంచి పట్టు వస్త్రాలు సమర్పించేవారు, మంత్రులు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు మాత్రమే ఉచితంగా అంతరాలయ దర్శనం కల్పిస్తామని దేవస్థానం ఈవో కె.సుబ్బారావు ప్రకటించారు. తీరా ఈవో ప్రకటనకు, క్షేత్రస్థాయిలో పరిస్థితికి పొంతనే లేకుండా పోయింది. గత ఏడాదితో పోలిస్తే టికెట్ల విక్రయాలు పెరిగినట్లు దేవస్థానం పేర్కొంది. 2024లో మొత్తం 32,461 టికెట్లు విక్రయించగా, ఈ సంవత్సరం 44,384 టికెట్లు అమ్ముడైనట్లు తెలిపింది. రూ.300, రూ.1000 టికెట్లలో గత ఏడాది కంటే ఈ ఏడాది అదనంగా 12,889 టికెట్లు విక్రయించామని పేర్కొంది. గత ఏడాది ఆన్‌లైన్‌లో రూ.300, రూ.1000 టికెట్లు కలిపి 8,216 విక్రయించగా, ఈ ఏడాది 11,590 అమ్ముడైనట్లు నివేదించారు. అంటే ఆన్‌లైన్‌లో 3,374 టికెట్లు అదనంగా విక్రయించామని చెబుతున్నారు. అయితే రూ.1000 టికెట్లు తొలిరోజు మాత్రమే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని, మిగతా ఏ రోజుల్లోనూ ఆ టికెట్లు లభించలేదని భక్తులు వాపోతున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై పారదర్శకత కొరవడిందని విమర్శిస్తున్నారు.

ఇంకెన్నాళ్లీ నిరీక్షణ?

- జనవరిలో దక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు ప్రధాని మోదీ శంకుస్థాపన
- ఇంతవరకూ భూమి చదునుకు మాత్రమే పరిమితమైన పనులు
- భవన నిర్మాణాలకు మరో రెండేళ్లు పట్టే అవకాశం
- తాత్కాలిక కార్యకలాపాలకు భవనాలున్నా స్పందించని రైల్వే శాఖ
- ఇప్పట్లో జోన్ కార్యకలాపాలు ఉండవంటున్న వాల్తేరు అధికారులు



సాక్షి, విశాఖపట్నం: విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు శంకుస్థాపన జరిగి నాలుగు నెలలు.. టెండర్లు ఖరారు చేసి ఐదు నెలలు పూర్తయినా.. ఇంకా భూమి చదును చేసే పనులకే పరిమితమైంది. భవనాలు నిర్మించేందుకు మరో రెండేళ్ల సమయం పట్టేలా కనిపిస్తోంది. తాత్కాలిక కార్యకలాపాలకు భవనాలు సిద్ధంగా ఉన్నా రైల్వే శాఖ మాత్రం ముందుకు రావడం లేదు. గతంలోనే ఇక్కడ ఉన్న భవనాల జాబితాను వాల్తేరు అధికారులు పంపించినా.. స్పందించకపోవడం చూస్తుంటే మరో రెండేళ్ల పాటు జోన్ కార్యకలాపాలు మొదలవ్వవేమోనన్న అనుమానాలు బలపడుతున్నాయి. సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటుకు 2019లో కేంద్రం పచ్చజెండా ఊపింది. జోన్‌కు సంబంధించిన డీపీఆర్‌ని అదే ఏడాది చివర్లో ఇచ్చేసినా రాజకీయ కక్షతో ముందడుగు వేయలేదు. 2024 ఎన్నికల అనంతరం నవంబర్‌లో టెండర్లు ఆహ్వానించారు. జనవరిలో ప్రధాని చేతుల మీదుగా జోన్ భవనాలకు శంకుస్థాపన చేశారు. అయినా ముడసర్లోవలో భూమి చదును చేసే పనుల్లోనే ఇంకా రైల్వే శాఖ నడిపిస్తోంది. ఈ భూములను తాము సాగుచేసుకుంటున్నామని స్థానికులు ఆందోళన చేయగా.. కూటమి నేతలు రంగంలోకి దిగి జోన్ భవనం వచ్చిన తర్వాత.. అందులో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పి వారిని శాంతింపజేశారు. అయినా.. ఇంకా చదును పనులే సా..గుతున్నాయి.

జీఎం నియామకం ఎప్పుడో..?

రైల్వే జోన్ కార్యకలాపాలను ప్రారంభించడానికి రైల్వేశాఖ మీనమేషాలు లెక్కిస్తోంది. రెండేళ్లలో జోనల్ కార్యాలయ నిర్మాణం పూర్తి చేసి, ఆ తరువాత ఆపరేషన్లు ప్రారంభిస్తామని సాకులు చెబుతోంది. ఇప్పటివరకు ప్రకటించిన రైల్వే జోన్లలో ఎక్కడా.. ఈ తరహా పరిస్థితులు కనిపించలేదు. జోన్ ప్రకటించిన తరువాత కార్యకలాపాల్ని తాత్కాలిక భవనాల్లో ప్రారంభించి.. కొత్త భవనాల నిర్మాణం అనంతరం అక్కడికి మార్చేవారు. కానీ విశాఖ జోన్ విషయంలో మాత్రం ఆది నుంచీ పూర్తి విరుద్ధంగా సాగుతోంది. కొత్త భవన నిర్మాణాలు చేపట్టిన తర్వాతే ఆపరేషన్లు ప్రారంభిస్తామంటూ రైల్వేశాఖ చెబుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. దక్షిణ మధ్య రైల్వే నుంచి విడదీసిన గుంటూరు, గుంతకల్, విజయవాడ డివిజన్లను, విశాఖ కేంద్రంగా ఉన్న వాల్తేరు డివిజన్‌ను కలిపి 'దక్షిణ కోస్తా' జోన్‌గా ప్రకటించారు. దాదాపు ఏపీ మొత్తం ఈ జోన్‌లోనే ఉండటంతో రాష్ట్రమంతటికీ సేవలందనున్నాయి. కొత్త రైళ్లు కావాలన్నా, రైల్వే లైన్లు కావాలన్నా జోనల్ అధికారులే ప్రతిపాదనలు పెట్టాలి. ఇది జరగాలంటే జోన్‌కు తొలుత జనరల్ మేనేజర్(జీఎం) నియామకం చేపట్టాలి. ఈ విషయంలోనూ బోర్డు స్పందించడం లేదు.

రాజకీయాలకు రైల్వే జోన్ బలి!



జోన్ భవనం రానున్నది ఇక్కడే..

కూటమి నేతల నిర్లక్ష్యం, ఒడిశా రాజకీయాలకు ఉత్తరాంధ్రుల చిరకాల స్వప్నమైన రైల్వే జోన్ పనులు ఇప్పట్లో పూర్తయ్యేలా కనిపించడం లేదు. కనీసం తాత్కాలిక భవనాల్లో కార్యకలాపాలు ప్రారంభించాలంటూ కూటమి ఎంపీలు గానీ, రాష్ట్ర ప్రభుత్వం గానీ రైల్వే మంత్రికి, బోర్డును కానీ కోరడం లేదు. శంకుస్థాపన చేసి నాలుగు నెలలు గడిచినా దీనిపై ఏ ఒక్క కూటమి ఎంపీ నోరు మెదపకపోవడం జోన్ పాలిట శాపంగా మారింది. దీన్ని ఆసరాగా తీసుకొని ఒడిశా పావులు కదుపుతోంది. అత్యధిక ఆదాయం వచ్చే వాల్తేరు డివిజన్‌ను వదులుకోవడం ఇష్టం లేని ఒడిశాలోని ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ అధికారులు తెర వెనుక రాజకీయాలు నడుపుతున్నారు. అక్కడ రాజకీయ నేతలు కూడా వీరికి సహకరించడంతో.. రైల్వే బోర్డు ఒడిశా ఏం చెబితే అదే చేస్తోంది. ఫలితంగా విశాఖ జోన్ బలవుతూ వస్తోంది.

తాత్కాలికానికి భవనాలు సిద్ధంగా ఉన్నా..!

బిల్డింగ్ నిర్మాణంతో పనిలేకుండా జోన్ కార్యకలాపాలు ప్రారంభించాలని కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. తాత్కాలిక కార్యాలయంగా ప్రస్తుతం ఉన్న వాల్తేరు డీఆర్‌ఎం కార్యాలయాన్ని వినియోగించుకోవచ్చు. ఈ విషయాన్ని ఇప్పటికే సౌత్ కోస్ట్ జోన్ ఓఎస్‌డీ.. తాను సమర్పించిన జోన్ డీపీఆర్‌లోనూ పొందుపరిచారు. రైల్వేస్టేషన్ పునర్నిర్మాణంలో భాగంగా స్టేషన్ బయట 'గతిశక్తి' పథకంలో భాగంగా 4 అంతస్తుల భవనాలు రెండు నిర్మించారు. ఒక్కో అంతస్తులో 4,500 చదరపు అడుగుల స్థలం అందుబాటులో ఉంది. కింద గ్రౌండ్ ఫ్లోర్‌తో కూడా కలుపుకొంటే దాదాపు 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన కొత్త భవనాలు ఉన్నాయి. తాత్కాలిక కార్యకలాపాలు చేపట్టేందుకు గెజిట్ విడుదల చేయాల్సి ఉన్నా బోర్డు నుంచి ఎలాంటి సూచనలు కనిపించడం లేదని వాల్తేరు అధికారులు చెబుతున్నారు. రెండేళ్ల క్రితమే తాత్కాలిక భవనాల జాబితా పంపించామని, ఇప్పటికీ అతీగతి లేకపోవడం చూస్తే ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయంటున్నారు. కూటమి ఎంపీలు, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని విశాఖవాసులు కోరుతున్నారు.

హైకోర్టు న్యాయమూర్తి ప్రియదర్శిని మృతికి సంతాపం



ప్రియదర్శిని(ఫైల్)



గిరిజ ప్రియదర్శిని చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న బైపా అరుణ్‌కుమార్

మహారాణిపేట/దాబాగార్డెన్స్ : తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి, విశాఖ వాసి జస్టిస్ మాటూరి గిరిజా ప్రియదర్శిని (54) హైదరాబాద్‌లో ఆకస్మిక మృతి పట్ల విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్ సంతాపం వ్యక్తం చేశారు. నగరానికి చెందిన జస్టిస్ ప్రియదర్శిని ఎంబీఎం లా కళాశాల నుంచి 1995లో న్యాయపట్టా అందుకున్నారు. 1995లోనే విశాఖ బార్ అసోసియేషన్‌లో పేరు నమోదు చేసుకున్నారు. అనంతరం ప్రముఖ న్యాయవాదులు ఉమాబాలాజీ, ఎస్.బద్రీనాథ్ దగ్గర న్యాయవాదిగా శిక్షణ పొందారు. 2008లో అదనపు జిల్లా న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. 2022లో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. ఇందిరా ప్రియదర్శిని సహచరులు లక్ష్మీ రాంబాబు, మంజులత, అరుణ కుమారి హేమలత తదితరులు తమ సంతాప సందేశాన్ని తెలిపారు. జిల్లా కోర్టు సమీపంలో బీఏకే చాంబర్స్‌లో ఆదివారం నిర్వహించిన సంతాప సభలో ఏపీ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు బైపా అరుణ్‌కుమార్ ఆమె చిత్రపటాని కి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. న్యాయవాదులు వాగుపల్లి చిన్నారావు, డాక్టర్ టి.బోసుబాబు, పాకా సత్యనారాయణ, లాయర్స్ ఫోరమ్ ఫర్ జస్టిస్ గుడిపల్లి సుబ్బారావు, నిమ్మకాయల ఈశ్వరరావు, సి.రవి, పడమట సురేష్, కోమల కిరణ్ పాల్గొన్నారు.

ఆ.. నర్సులకు నైట్ డ్యూటీలు

దాబాగార్డెన్స్: కేజీహెచ్‌లో కొన్నేళ్లుగా రాత్రి విధుల నుంచి తప్పించుకుంటున్న నర్సులకు ఎట్టకేలకు నైట్ డ్యూటీలు కేటాయించారు. 'కొందరికే నైట్ డ్యూటీ ఎందుకు?' శీర్షికతో గత నెల 23న 'సాక్షి'ఓ కథనం ప్రచురించింది. కొన్నేళ్లుగా హెడ్ నర్స్ జెస్సీ ఈవెంజలీన్‌తో పాటు స్టాఫ్ నర్సులు నీలవేణి, ఎస్వై సత్యవతి, పాత్ర మోసెస్, ఎంపీ నాగమణి దేవి రాత్రి విధుల నుంచి ఏవేవో కారణాలు చూపుతూ తప్పించుకుంటున్నారు. వీరితో పాటు మరికొందరు ఈ జాబితాలో ఉన్నారు. ఈ కథనానికి స్పందించిన

సాక్షి ఎఫెక్ట్..

కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ఆ మరుసటి రోజే నర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులతో సమావేశమయ్యారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, రొటేషన్ ప్రకారం నైట్ డ్యూటీలు చేయాలని ఆ సమావేశంలో స్పష్టం చేశారు. ఇటీవల కేజీహెచ్‌ను సందర్శించిన అదనపు డీఎంఈ కూడా పలు ఆదేశాలిచ్చారు. వార్డుల్లో ఏ సమస్య ఉన్నా హెడ్ నర్సులదే బాధ్యత అని, బ్లాకుకు ఒక హెడ్ నర్సు ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో హెడ్ నర్స్ జెస్సీ ఈవెంజలీన్‌తో పాటు స్టాఫ్ నర్సులు నీలవేణి, ఎస్వై సత్యవతి, పాత్ర మోసెస్, ఎంపీ నాగమణి దేవికి ప్రస్తుతం నైట్ డ్యూటీలు కేటాయించారు. డీఎంఈ ఆదేశాల మేరకు బ్లాకుకు ఒక హెడ్ నర్స్‌ను నియమించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి సమష్టి కృషి



పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజును సత్కరిస్తున్న జిల్లా కార్యవర్గ, అనుబంధ విభాగాల అధ్యక్షులు

- పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు పిలుపు
- 9న బాధ్యతల స్వీకరణ

సాక్షి, విశాఖపట్నం: కూటమి ప్రభుత్వం మోసాలు, అబద్ధపు హామీలను ప్రజల ముందు ఎండగట్టి.. వైఎస్సార్ సీపీ బలోపేతానికి సమష్టిగా పనిచేద్దామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు పిలుపునిచ్చారు. ఈ నెల 9న పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కె.కె.రాజు బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలో నూతన జిల్లా కార్యవర్గం, అనుబంధ విభాగాల అధ్యక్షులతో మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించారని, ఈ పదవి తనకు మరింత బాధ్యతను పెంచిందన్నారు. పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకుంటూ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కూటమి ప్రభుత్వ 11 నెలల పాలనలో ఉత్తరాంధ్రకు ముఖ్యంగా విశాఖ నగరానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. రానున్న కాలంలో ప్రభుత్వ వైఫల్యాలను ఏ విధంగా ఎండగట్టాలి? కార్యకర్తలను సమాయత్తం చేసేందుకు ఎటువంటి ప్రణాళికలు రూపొందించాలనే అంశాలపై చర్చించారు. ఈ నెల 9న ఉదయం 10 గంటలకు జరగనున్న జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, అనకాపల్లి అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీలు, సమన్వయకర్తలు హాజరవుతున్నట్లు చెప్పారు. సమావేశంలో సమన్వయకర్త తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి, పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవి రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బానాల శ్రీనివాసరావు, చెన్నా జానకీరామ్, బోని బంగారు నాయుడు, రాజన్న వెంకట్రావు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, కార్యదర్శులు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం అందజేత



ఉమామహేశ్వరరావు, వెంకటరావు కుటుంబాలకు చెక్కు అందజేస్తున్న జేసీ



వెంకటరత్నం, మహాలక్ష్మి కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న జేసీ మయూర్ అశోక్, ఎమ్మెల్యే వెలగపూడి

మధురవాడ/మద్దిలపాలెం/సింహాచలం/ఆరిలోవ: సింహాచలం చందనోత్సవం సందర్భంగా గోడ కూలి ఏడుగురు మృతి చెందగా, ఒక్కరు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో బాధితులకు ఆదివారం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించింది. జీవీఎంసీ 7వ వార్డు చంద్రంపాలేనికి చెందిన పిళ్లా ఉమామహేశ్వరరావు, శైలజ దంపతుల కుటుంబానికి రూ.50 లక్షలు(ఒక్కొక్కరికి రూ.25 లక్షలు), పాత అడవివరం నివాసి ఎడ్ల వెంకటరావు కుటుంబ సభ్యులకు 25 లక్షల చొప్పున జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ నష్టపరిహారం చెక్కులు అందజేశారు. జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీపాలెం ఉమానగర్‌కు చెందిన పైలా వెంకటరత్నం, ఆమె ఆడపడుచు గుజ్జరి మహాలక్ష్మి కుటుంబ సభ్యులకు చెరో రూ.25 లక్షలు, గాయాలు పాలైన జీవీఎంసీ 11వ వార్డు పరిధి ఆరిలోవ బాలాజీనగర్‌కు చెందిన పైలా ప్రవీణ్‌కు రూ.3లక్షలు చొప్పున జేసీతోపాటు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పరిహారం చెక్కులను అందించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, ప్రమాదంపై విచారణ జరుగుతోందని జేసీ తెలిపారు. కుటుంబ సభ్యులు ఒకరికి ఉద్యోగం కల్పించాలని పలువురు బాధితులు కోరగా.. త్వరలోనే ఉద్యోగం ఇప్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఉద్యోగం తన మరిది భార్యకి ఇవ్వాల్సిందిగా వెంకటరావు భార్య కోరడంతో.. ఈ విషయంపై కుటుంబ సభ్యులంతా అంగీరపత్రాన్ని ఇవ్వాలని జేసీ సూచించారు. ఆర్డీవో సంగీత్ మాథూర్, విశాఖ రూరల్ తహసీల్దార్లు రమేష్, పాల్ కిరణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

'ప్రైవేట్ పాఠశాలలపై ఒత్తిడి తగదు'

ఆరిలోవ: ప్రైవేట్ పాఠశాలలపై కూటమి ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి చేస్తోందని అపుస్మా జిల్లా అధ్యక్షుడు ఎం.వి.రావు తెలిపారు. విశాఖ వ్యాలీ స్కూల్‌లో ఆదివారం అపుస్మా కార్యనిర్వాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ విధానాలు ప్రైవేట్ పాఠశాలలపై మరింత ఒత్తిడికి గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఆరు నెలలుగా ఏదో ఒక జీవో విడుదల చేసి ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలలకు గుర్తింపు సమయంలో అందించిన ఫారం-1ను బయటకు తీసి మార్పులు చేసి.. మళ్లీ సబ్మిట్ చేయాలని అడుగుతున్నట్లు పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల వేతనాల వివరాలు ఆన్‌లైన్‌లో పెట్టమని అడగడం సమంజసంగా లేదన్నారు. అపుస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వ వైఖరి కార్పొరేట్ విద్యా సంస్థలకు అనుకూలంగా ఉంటూ.. ప్రైవేట్ పాఠశాలలను ఇబ్బంది పెడుతున్నట్లు ఉందని ఆరోపించారు. సమావేశంలో పలువురు అపుస్మా సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి క్రీడా శిబిరాలు

విశాఖ స్పోర్ట్స్: క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నుంచి విశాఖలో 28 క్రీడాంశాల్లో 50 వార్షిక వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు.. సాయంత్రం 3.30 నుంచి 6.30 గంటల వరకు పీఈటీ, పీడీ, సీనియర్ ఆటగాళ్లు ఈ శిబిరాలను నిర్వహించనున్నారు. అథ్లెటిక్స్‌తో సహా బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, వాలీబాల్ క్రీడాంశాల్లో నాలుగేసి శిబిరాలు ఆయా ప్రాంతాల్లో నిర్వహించనుండగా జూడో, తైక్వాండో, ఖోఖోల్లో రెండేసి శిబిరాలు, బాక్సింగ్, చెస్, సైక్లింగ్, ఫెన్సింగ్, హ్యాండ్‌బాల్, కరాటే, కయాకింగ్, మల్లకంబ, పవర్‌లిఫ్టింగ్, ట్రయాథ్లాన్, యాటింగ్, వెయిట్‌లిఫ్టింగ్, వుషులో ఒకో శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ శిబిరాలు ఈనెల 31వ తేదీతో ముగియనున్నాయి.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్ట్

సీతంపేట: ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి తరలిస్తున్న నలుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి. భోపాల్‌కు చెందిన బాలికతో పాటు గౌరవ్‌కుమార్, వివేక్, అకిలవార్ ఒడిశాలోని బాలంగిర్ జిల్లాలో 14 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. ఈ గంజాయిని భోపాల్‌కు తీసుకువెళ్లే క్రమంలో శనివారం రాత్రి రైల్వేస్టేషన్ సమీపంలోని పోస్టాఫీస్ వద్ద వేచి ఉన్నారు. ఇంతలో టాస్క్‌ఫోర్స్ సీఐ భాస్కర్ ఆధ్వర్యంలో ఎస్ఐ భరత్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించి, నలుగురిని అరెస్ట్ చేశారు. గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

గోస్తనీ గొంతెండుతోంది

విశాఖపట్నం, విజయనగరం జిల్లాల పరిధిలోని పలు ప్రాంతాలకు జీవనాధారమైన గోస్తనీ నది నేడు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. జీవీఎంసీతో పాటు భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండలాలు, విజయనగరం జిల్లాలోని పలు పంచాయతీల తాగునీటి అవసరాలను తీర్చే ఈ నది.. ఇసుకాసురుల దాటికి, సరైన ప్రణాళిక లోపంతో ప్రజల దాహార్తిని తీర్చలేని స్థితికి చేరుకుంది. వేసవి వచ్చిందంటే చాలు నది ఎండిపోవడం, ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడటం పరిపాటిగా మారింది. ప్రభుత్వాలు, అధికారులు కేవలం తాత్కాలిక పరిష్కారాలపై ఆధారపడుతుండటంతో ఈ సమస్య మరింత జటిలంగా మారుతోంది.

– తగరపువలస



నీరు లేని ప్రాంతంలో ఊటబావి

- ఇసుకాసురుల దాటికి బలైన నది
- తాత్కాలిక పరిష్కారాలతో ప్రజాధనం వృథా
- చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతోనే మేలు



రిజర్వాయర్ నుంచి విడుదలైన నీరు

గోస్తనీ నది విశాఖ, విజయనగరం జిల్లాల్లోని సుమారు 5 నుంచి 6 లక్షల మంది ప్రజల రోజువారీ తాగునీటి అవసరాలను తీరుస్తోంది. ఆనందపురం మండలం బోని వద్ద నుంచి జీవీఎంసీకి, పద్మనాభం మండలం పాండ్రంగి సమీపంలోని సామియ్యవలస వద్ద నిర్మించిన ఊట బావులు, పంప్‌హౌస్‌ల ద్వారా భీమిలి జోన్‌కు నీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే గ్రామీణ నీటి సరఫరా విభాగం నదీ తీరంలో బోర్లు వేసి.. ఆ నీటిని రక్షిత మంచినీటి పథకాల ట్యాంకులకు తరలించి ప్రజలకు అందిస్తోంది.

వేసవి కష్టం.. తాటిపూడిపైనే భారం

ప్రతి ఏటా ఏప్రిల్, మేలో గోస్తనీ నది చాలా చోట్ల ఎండిపోతుంది. దీంతో జీవీఎంసీ సహా అనేక పంచాయతీల్లో తాగునీటి సమస్య తీవ్రమవుతుంది. ఆ సమయంలో వర్షాలు పడితే కొంత ఉపశమనం లభిస్తుంది. లేదంటే విజయనగరం జిల్లాలోని తాటిపూడి రిజర్వాయర్ నుంచి వచ్చే నీరే దిక్కు. ప్రస్తుతం రెండు వారాల కిందట విడుదల చేసిన నీరు నదిలో చేరినా.. అది కేవలం మరో పది రోజులకు మాత్రమే సరిపోతుందని అంచనా వేస్తున్నారు. మరోమారు రిజర్వాయర్ నుంచి నీరు విడుదల కావడం లేదా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం జరిగితేనే తాగునీటి సమస్య నుంచి గట్టెక్కే అవకాశం ఉంది.

ఇసుక తవ్వకాలతోనే ఈ పరిస్థితి

గత టీడీపీ ప్రభుత్వ(2014–2019) హయాంలో గోస్తనీ నదిలో విచ్చలవిడిగా జరిగిన ఇసుక తవ్వకాలు నది సహజ స్వరూపాన్ని దెబ్బతీశాయి. పద్మనాభం మండలం పొట్నూరు నుంచి తగరపువలస వరకు ఇసుకాసురులు నది గర్భాన్ని తోడేశారు. కోట్ల విలువైన ఇసుకను తరలించడంతో నీటి నిల్వ సామర్థ్యం పూర్తిగా దెబ్బతింది. ఫలితంగా నేడు నదీ పరీవాహక ప్రాంతం ముళ్ల చెట్లు, గోతులతో నిండిపోయి అడవిని తలపిస్తోంది. నీటి జాడ కనిపించడమే గగనమైపోయింది.



చెక్‌డ్యామ్ నిర్మించాల్సిన అవసరం ఉన్న ప్రాంతం ఇది..

తాత్కాలిక కట్టలు.. రూ.లక్షలు వృథా

గోస్తనీ నదిపై చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తే నీటిని నిల్వ చేసుకోవచ్చని మేధావులు సూచిస్తున్నా.. ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. పాండ్రంగి పంచాయతీ పరిధిలో మునివానిపేట నుంచి తగరపువలస వరకు ఒక్క చెక్‌డ్యామ్ కూడా లేదు. గతంలో తాటితూరు వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్‌ను కొందరు ధ్వంసం చేయడంతో నీరు నిలవడం లేదు. దీంతో భీమిలి జోనల్ అధికారులు ఏటా సామియ్యవలస వద్ద ఇసుక బస్తాలు, మట్టి కట్టల పేరుతో రూ.లక్షలు నదిలో కుమ్మరిస్తున్నారు. ఏప్రిల్‌లో ఏర్పాటు చేసే ఈ తాత్కాలిక కట్టలు.. జూన్‌లో వచ్చే వర్షాలకు కొట్టుకుపోతున్నాయి.

బోరు నీళ్లే దిక్కు?

భీమిలి మున్సిపాలిటీ గతంలో ఏటా మార్చి నుంచి జూన్ వరకు తీవ్ర తాగునీటి సమస్యను ఎదుర్కొనేది. 2005లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 'నగరబాట' కార్యక్రమంలో ఇక్కడ ప్రజల కష్టాలు చూసి.. రూ.12 కోట్లతో తాగునీటి పథకాన్ని మంజూరు చేశారు. సామియ్యవలస వద్ద పంప్‌హౌస్, ఆరు ఊటబావులు నిర్మించి నిరంతర నీటి సరఫరాకు మార్గం వేశారు. అయితే పాండ్రంగి, మజ్జివలస, తాటితూరు, టి.నగరపాలెం, తగరపువలస ప్రాంతాల్లో ఇసుక తవ్వకాల ప్రభావంతో సామియ్యవలస వద్ద కూడా ఏప్రిల్, మేలో నీటి లభ్యత తగ్గిపోతోంది. ప్రస్తుతం రెండు ఊటబావులు పనిచేయకపోవడంతో ప్రత్యామ్నాయంగా రెండు బోర్లు తవ్వి నీటిని భీమిలి జోన్ ప్రజలకు సరఫరా చేస్తున్నారు. అయితే ఈ బోర్ల నీరు తాగడానికి అనుకూలంగా లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు భీమిలిలోని కొన్ని కార్పొరేట్ ఆసుపత్రులు, విద్యాసంస్థలు నదిని ఆనుకుని బోర్ల ద్వారా రోజూ వందలాది ట్యాంకర్లతో నీటిని అక్రమంగా తరలించుకుపోతున్నారు. ఈ అక్రమ నీటి రవాణా పలువురికి కాసులు కురిపిస్తోంది.



ఊట బావులు ఎండిపోయిన చోట ఉన్న బోరు

శాశ్వత పరిష్కారమే శరణ్యం

సామియ్యవలస, తాటితూరు, టి.నగరపాలెం వద్ద శాశ్వత చెక్‌డ్యామ్‌లు నిర్మించి, తగరపువలస వద్ద నది గట్టు ఎత్తు పెంచితే.. వర్షాకాలంలో వచ్చే నీటిని సముద్రంలో కలవకుండా నిల్వ చేసుకోవచ్చు. దీనివల్ల వేసవిలో తాగు నీటి సమస్యను అధిగమించవచ్చని.. ఇసుక బస్తాలు, మట్టి కట్టల కోసం ఏటా చేస్తున్న వృథా ఖర్చును తగ్గించవచ్చని రెండు జిల్లాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి శాశ్వత పరిష్కార మార్గాలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



సామియ్యవలస వద్ద నీటికి అడ్డంగా ఇసుక బస్తాలను పెట్టిన జీవీఎంసీ సిబ్బంది

'ప్రసాద్' పనుల్లో నాణ్యత ఎంత?

సింహాచలంలో జరుగుతున్న పనులు పరిశీలించిన దేవదాయ శాఖ సీఈ

సింహాచలం: సింహాచలం క్షేత్రంలో జరుగుతున్న ప్రసాద్ పథకం అభివృద్ధి పనుల్లో నాణ్యతపై దేవదాయశాఖ ఇంజినీరింగ్ విభాగం పరిశీలన చేపట్టింది. ఆ శాఖ చీఫ్ ఇంజినీర్ శేఖర్ ఆదివారం ఈ పనులను పరిశీలించారు. సింహాచలం దేవస్థానంలో రూ.54 కోట్లతో ప్రసాద్ పథకం పనులు జరుగుతుండగా.. వాటిలో సుమారు రూ.30 కోట్ల పనులు సింహగిరిపైనే చేపడుతున్నారు. మరో రూ.24 కోట్ల పనులు కొండదిగువ జరుగుతున్నాయి. ఈ పనులన్నీ పర్యాటక శాఖ చేపడుతోంది. పాత షాపింగ్ కాంప్లెక్స్ పైభాగంలో నిర్మించిన నాసిరకం గోడ కూలడంతో రూ.300 క్యూల్లో ఉన్న ఏడుగురు భక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ గోడ చందనోత్సవానికి కొద్ది రోజులముందే నిర్మించడంతో ఆ రోజు కురిసిన భారీ వర్షానికి కూలిపోయింది. ఆ గోడ నిర్మాణ బాధ్యతపై దేవస్థానం, పర్యాటక శాఖ ఇంజినీరింగ్ అధికారులు ఎవరి వాదన వారు వినిపిస్తున్నారు. ప్రభుత్వ విచారణ కమిటీ ముందు కూడా ఇరు శాఖల ఇంజినీర్లు అదే వాదన వినిపించారు. దీంతో ఇరు శాఖల మధ్య సమన్వయం లేదంటూ కమిషన్ కూడా బహిరంగానే వారిని హెచ్చరించింది. టూరిజం ఇంజినీర్లు పనులు చేసినా.. దేవదాయశాఖ, దేవస్థానం ఇంజినీర్ల పర్యవేక్షణ అక్కరలేదా అంటూ కమిటీ ప్రశ్నించింది. ఆ సమయంలో అక్కడే ఉన్న దేవదాయశాఖ సీఈ శేఖర్‌పై ప్రశ్నల వర్షం కురిపించింది. ఈ తరుణంలోనే సింహాచలం దేవస్థానంలో జరుగుతున్న మొత్తం అభివృద్ధి పనులను పరిశీలించి నివేదిక ఇవ్వాలని దేవదాయశాఖ చీఫ్ ఇంజినీర్‌ని ఆ శాఖ ఆదేశించింది. దీంతో సీఈ శేఖర్ గడిచిన రెండు రోజులుగా ఆయా పనులను పరిశీలించారు. ఇరు శాఖల అధికారులు సమన్వయం చేసుకుని పనులు చేస్తున్నారా? లేదా? పనుల్లో ఎక్కడైనా లోపాలు ఉన్నాయా? కూలిన గోడ ఏమేర నాణ్యతతో ఉంది? క్వాలిటీ కంట్రోల్ టెస్టులన్నీ జరుగుతున్నాయా? లేదా అన్న అంశాలపై వివరాలు సేకరించారు. నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తానని చీఫ్ ఇంజినీర్ తెలిపారు. పనులు ఆలస్యం కావడానికి బిల్లులు మంజూరు కాకపోవడం ఒక కారణంగా తెలుస్తోందని శేఖర్ తెలిపారు. దేవస్థానాల్లో జరిగే రూ.40 లక్షల అభివృద్ధి పనుల మంజూరు ఆయా దేవస్థానాల పరిధిలోనే ఉంటుందన్నారు. సింహాచలం దేవస్థానంలో 25 ఏళ్ల సీనియర్ ఇంజినీర్లు ఉన్నారన్నారు. పర్యాటక శాఖ ఈఈ రమణ, ఏఈ మదన్‌మోహన్, దేవస్థానం ఈఈ రాంబాబు, తదితరులు సీఈ వెంట ఉన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గోడ కూలింది

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్

మధురవాడ: ప్రభుత్వం, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వల్లే చందనోత్సవం రోజు సింహాచలంలో గోడ కూలిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ అన్నారు. ప్రభుత్వ తప్పిదం వల్ల జరిగిన ఘోర ప్రమాదాన్ని వర్షం కారణంగా చూపడం వెనుక.. వారు చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడమే తప్ప మరొకటి కాదన్నారు. గోడ కూలి మృతి చెందిన సాఫ్ట్‌వేర్ దంపతులు పిళ్లా ఉమామహేశ్వరరావు, శైలజ కుటుంబ సభ్యులను ఆదివారం వారి స్వగృహంలో పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కనీసం పిల్లర్లు, కాంక్రీట్ బెల్టులు లేకుండా గోడ ఎలా కట్టారని ప్రశ్నించారు. కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యం, అజాగ్రత్త వల్లే నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయని, వారి కుటుంబాలకు కనీసం కోటి రూపాయలైనా పరిహారం ఇవ్వాలన్నారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం శాశ్వత ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు, ప్రజలకు ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. ఆయన వెంట సీపీఎం నాయకులు కృష్ణారావు, డి.అప్పలరాజు, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.




మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకుడు కుమార్ తదితరులు

కొనసాగుతున్న స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీ ప్రక్రియ

ప్రీ ఫైనల్ జాబితా విడుదల

మహారాణిపేట: స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. గత ఆరు నెలల నుంచి ఈ ప్రక్రియ వివిధ కారణాలతో సాగుతూ వస్తోంది. ఈ పోస్టులు ఎప్పుడు భర్తీ అవుతాయని నిరుద్యోగ నర్సులు ఆశగా ఎదురుచూస్తున్నారు. గత నెల 25న ఫైనల్ జాబితా విడుదల చేశారు. దీనిపై 34 అభ్యంతరాలు రావడంతో వాటిని పరిశీలించి ఈనెల 2వ తేదీన ప్రీ ఫైనల్ జాబితా విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో ఆ పోస్టులపై ఏమి చేయాలన్న దానిపై ప్రభుత్వానికి లేఖ రాశారు. వీటిపై వివరణ వచ్చిన తర్వాత పోస్టుల భర్తీ ప్రక్రియ చేపడతారు. తొలుత ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో 106 నర్సుల పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత పలు మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ ఆస్పత్రులకు సంబంధించి అదనంగా 264 పోస్టులు చేరడంతో.. ఈ సంఖ్య 370కి చేరింది. ఈ పోస్టులకు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో మొత్తం 8,300 దరఖాస్తులు వచ్చాయి. ఈ ఏడాది జనవరి 27న ప్రొవిజినల్ జాబితా విడుదల చేశారు. ఈ జాబితా మీద అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ 1570 దరఖాస్తులు ప్రాంతీయ వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి వచ్చాయి. వీటి పరిశీలన అనంతరం గత నెల 25న ఫైనల్ జాబితా విడుదల చేశారు. దీనిపై అభ్యంతరాలు రావడంతో వాటిని పరిశీలించి ఈనెల 2వ తేదీన ప్రీ ఫైనల్ జాబితా విడుదల చేశారు.

పీతల మూర్తి యాదవ్‌పై చర్యలకు డిమాండ్



పొక్లెయిన్‌తో గోడను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

బీచ్‌రోడ్డు: పిఠాపురం కాలనీలోని వాంబే గృహ గోడ కూల్చడంపై రజకుల సేవా సంఘం వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం నిరసన చేపట్టారు. గోడ కూల్చివేతకు సంబంధించి టౌన్ ప్లానింగ్ సిబ్బందిని 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ పంపించాడని ఆరోపిస్తూ.. జనసేన పార్టీ అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలపై మూర్తి యాదవ్ దౌర్జన్యం చేస్తున్నాడని మండిపడ్డారు. పిఠాపురం కాలనీలో ప్రభుత్వం ఇచ్చిన వాంబే గృహాల్లో ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్నామన్నారు. పీతల మూర్తిని స్థానికులు పట్టించుకోకపోవడంతో వార్డు ప్రజలపై దౌర్జన్యం మొదలుపెట్టాడని ధ్వజమెత్తారు. ఇందులో భాగంగా ప్రహరీని విరగొట్టించాడని దుమ్మెత్తి పోశారు. అతని దగ్గర నాలుగేళ్లుగా లంచం తీసుకుని పనిచేస్తున్న టౌన్ ప్లానింగ్ సెక్రటరీ జ్యోతిని పంపి.. ఈ పని పూర్తి చేయించాడని ఆరోపించారు. వార్డు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న పీతల మూర్తిపై పవన్ కల్యాణ్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అతని నుంచి 22వ వార్డు ప్రజలను కాపాడాలని కోరారు.

జాతీయ ఐస్ బాల్ హాకీ టోర్నీకి 12 జట్ల ఎంపిక

పెందుర్తి: సుజాతనగర్‌లో ఈ నెల 17, 18 తేదీల్లో జరగనున్న జాతీయ ఫెడరేషన్ బ్యాండి (ఐస్‌బాల్ స్కేటింగ్ హాకీ) టోర్నీ కోసం దేశ వ్యాప్తంగా 12 జట్లు ఎంపికయ్యాయి. సుజాతనగర్‌లోని సీ2 జోన్ పార్కులో ఉన్న సింథటిక్ ఐస్ స్కేటింగ్ రింక్‌లో శని, ఆదివారాల్లో జాతీయ రిఫరీ ఎండీ నసీర్దున్ ఆధ్వర్యంలో ఈ ఎంపిక ప్రక్రియ జరిగింది. దేశ వ్యాప్తంగా 20 జట్లకు చెందిన క్రీడాకారులు ఈ ఎంపికలకు హాజరు కాగా.. 12 జట్లను ఎంపిక చేసినట్లు మురళి రోలర్, ఐస్ స్కేటింగ్ అకాడమీ వ్యవస్థాపకుడు పూసర్ల మురళి తెలిపారు.

'శుభం' సినిమాకొస్తే నవ్వులే నవ్వులు

హీరోయిన్, నిర్మాత సమంత



నగరంలో ప్రముఖ హీరోయిన్ సమంత సందడి చేసింది. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ఆమె నిర్మించిన 'శుభం' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'శుభం' సినిమా చూశాక ప్రేక్షకులు చిరునవ్వుతో బయటకు వస్తారని మాటిస్తున్నట్లు చెప్పారు. అయితే చాలా రోజుల తర్వాత సమంత ఫుల్ జోష్‌లో కనిపించారు. స్టేజ్‌పై చిత్ర నటీనటులతో కలిసి సినిమాలోని 'జన్మజన్మల బంధం' అనే పాటకు డ్యాన్స్ చేశారు.

– సాక్షి, విశాఖపట్నం

ప్రైవేటులో 'ఉచితం' అందేనా..!

- వైఎస్సార్ సీపీ హయాంలో 25 శాతం సీట్లు పక్కాగా అమలు
- గతేడాది 2,989 మంది పేద విద్యార్థులకు ప్రయోజనం
- జిల్లాలో 621 ప్రైవేటు స్కూళ్లలో అడ్మిషన్లు పొందే అవకాశం
- ఈ నెల 19 వరకు దరఖాస్తు గడువు

విశాఖ విద్య : ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా అందించేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. 2025–26 విద్యా సంవత్సరానికి రాష్ట్ర సిలబస్‌తో పాటు ఐబీ/ఐసీఎస్ఈ/సీబీఎస్ఈ బోధన అందిస్తున్న జిల్లాలోని 621 ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించేలా అధికారులు క్షేత్రస్థాయిలో సమీక్షిస్తున్నారు. అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు ఆన్‌లైన్ ద్వారా లేదా సమీపంలోని సచివాలయాల్లో అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవడానికి వీలుగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మొండికేస్తున్న ప్రైవేటు యాజమాన్యాలు

ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు ఉచితంగా పేద విద్యార్థులకు ఇచ్చే క్రమంలో గుర్తింపు ఉన్న ప్రైవేటు స్కూళ్ల పూర్తి వివరాలను కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో పొందుపరచాలి. అయితే జిల్లాలోని కొన్ని ప్రైవేటు స్కూళ్ల వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు కాలేనట్లుగా తెలుస్తోంది. గతంలో ఫీజులు పెండింగ్ ఉన్నాయంటూ కొన్ని యాజమాన్యాలు కోర్టును సైతం ఆశ్రయించినట్లుగా తెలుస్తోంది. నగరంలో క్రేజ్ ఉన్న స్కూళ్ల యాజమాన్యాలు విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడిచేలా వ్యవహరిస్తున్నాయి.



అధికారులతో సమీక్షిస్తున్న సమగ్ర ఏపీసీ చంద్రశేఖర్ రావు (ఫైల్)

వైఎస్సార్‌సీపీ హయాంలో పకడ్బందీగా అమలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో పేద విద్యార్థులకు ఉచిత విద్యను పకడ్బందీగా అమలు చేశారు. 2022–23లో 86 మంది, 2023–24లో 1,227 మంది, 2024–25లో 2,989 మంది ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఉచిత సీట్లు కేటాయించిన పాఠశాలలకు ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ఫీజులను పాఠశాల యాజమాన్యాలకు చెల్లించేందుకు ఒప్పందం కుదిరింది. కూటమి ప్రభుత్వం గత ఏడాది, ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజు బకాయిలను చెల్లించకపోవడంతో జిల్లాలోని చాలా పాఠశాలల యాజమాన్యాలు ఉచిత సీట్లు ఇచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో 2025–26 విద్యా సంవత్సరంలో ఎంత మంది ఉచిత విద్యను పొందుతారనేది వేచి చూడాల్సి ఉంది.

షెడ్యూల్

- ఈ నెల 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- ఈ నెల 20 నుంచి 24 మధ్య అర్హులైన విద్యార్థుల జాబితాను ప్రకటిస్తారు.
- ఈనెల 29న మొదటి రౌండ్ లాటరీ నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తారు.
- జూన్ 8న ఎంపికైన విద్యార్థులు స్కూళ్లలో చేరాలి.
- జూన్ 11న రెండో రౌండ్ లాటరీ నిర్వహించి, విద్యార్థులను ఎంపిక చేస్తారు.
- జూన్ 18న విద్యార్థులు స్కూళ్లలో చేరాల్సి ఉంటుంది.

సచివాలయాల వారీగా సమీక్ష



పేద విద్యార్థులకు ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం సీట్లు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలో గుర్తింపు గల స్కూళ్లు కచ్చితంగా వెబ్‌సైట్‌లో నమోదయ్యేలా దృష్టి పెట్టాం. సచివాలయాల వారీగా దీనిపై సమీక్షిస్తున్నాం. అర్హులంతా గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి.

– డాక్టర్ జి.చంద్రశేఖర్ రావు, ఏపీసీ, సమగ్ర శిక్ష, విశాఖ జిల్లా

సద్వినియోగం చేసుకోవాలి



విద్యాహక్కు చట్టం మేరకు గుర్తింపు ఉన్న ప్రైవేటు స్కూళ్లలో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఇవ్వాలి. దీన్ని అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలి. ఉచిత విద్య ప్రవేశాలపై ప్రతీ రోజూ డీఈవోల పర్యవేక్షణలో మండలాల వారీగా సమీక్షిస్తున్నాం.

– బి.విజయ్ భాస్కర్, ఆర్జేడీ